# ఆదర్శాలు అపహసించినవేళ

శ్రమ పుత్రిక అరుణను... ఆహ్వానితులు కోమలి, రమేష్ !

ఆ వివాహ మహోత్సవాహ్వాన పత్రికను పదే పదే తిరగా బోర్లావేసిచూచింది దేవకి. అవేపేర్లు! మార్పులేదు. తన కండ్లు భ్రాంతి చెందలేదు.

ఈ దేశంలో 'వివాహం విడ్డూరమైన విషయమేమీ కాదు. దేవకి అయినా మరెవ్వరైనా అంతగా ఆశ్చర్యమందే టందుకు. అయితే, ఆ ఆహ్వానితులైన దంపతులతో తనకు గల అనుబంధమే దేవకిలో అంతగా ఆలోచనలఅలలనుసృష్టిం చింది. ఆ పెండ్లికుమార్తె అయిన అరుణ వయసే ఆమెను ఆశ్చర్యచకితను కావించింది. పధ్నాలుగవఏట వివాహమా? కోమలీ రమేష్ వంటివిద్యావంతులు యిలా చేస్తున్నారేమిటి సనాతనులవలె ?

తప్పక వెళ్ళాలి! వెళ్ళితీరాల్సిన బంధుత్వం కాదు బాంధవ్యాన్ని మించిన అనుబంధం తనకూ, రమేష్‌కూ. కానీ "ఏమిటా అనుబంధం?" అని ప్రశ్నిస్తే విశదీకరించలేని —తనకూ రమేష్‌కూ కోమలికి మాత్రమే తెలిసిన భవ

బంధం అది. అందరికీ అర్థంకాదు.

"నేను రాలేను. నీవు మాత్రం అంత పనిగట్టుకు వెళ్ళకపోతేనేం? నీ స్వంత చెల్లెలు కాదుగా కోమలి? పిన తండ్రికూతురు" అన్నాడు మాధవరావు. "నీవు వెళ్ళక పోయినా పెళ్ళికి పెద్ద లోటు కన్పించదులే" అనే అర్థాన్ని స్ఫురింపజేస్తూ.

"కాదు, వెళ్ళాలి. మనమ్మాయి పెళ్ళికి వాళ్ళు మాత్రం రావద్దూ?" అన్నది నవ్వలేక నవ్వుతూ.

విరగబడి నవ్వాడు భర్త. వాళ్ళు పధ్నాలుగేళ్ళ దానికే పెళ్ళి చేసేస్తున్నారని నువ్వుకూడా అప్పుడే హడా వుడిపడ్తున్నావనుకున్నాను నీ కూతురి పెళ్ళికోసం!" మరింత నవ్వుతూ అన్నాడు! "పాతికేళ్ళు దాటనిదే జలజకు పెళ్ళి ప్రసక్తేలేదు. అదైనా దాని యిష్టప్రకారం... అది కావా లనుకుంటేనే, ఎంతవరకూనైనా చదువుకోనీ చెప్పిద్దాం. ఈ కాలంలోకూడా యింకా పెళ్ళిళ్ళు తలిదండ్రులు చేయట మేమిటి? వాళ్ళే చేసుకుంటారు."

"తన యిష్టప్రకారం?" భర్తకు కోటుఅందిస్తూ ఆశ్చ ర్యంగా ప్రశ్నించింది దేవకి. "అయితే ఏకులంవాడైనా సరే ఒప్పుకుంటారన్నమాట? ఎవరైనాసరే అభ్యంతరం లేదా?"

"లేదని చెప్పానుగా? వాళ్ళిష్టం!" సగర్వంగా అన్నాడు.

"ఉట్టి కెగర లేనమ్మ స్వర్గాని కెగిరిందట!" హేళనగా అన్నది. "ఏది నా ముఖం చూసి చెప్పండి?" భర్త కనుల లోనికి చూస్తూ అడిగింది. అతడికి సైకద్దూ.

"ఊఁ, సర్లే" చూపులు త్రిప్పుకున్నాడు టైనాట్ సరిగావుందో లేదో అద్దంలో చూచుకునే మిషతో. "నీతో పెట్టుకుంటే అయినట్లేలే నా ఆఫీసు" అంటూ వెళ్ళి పోయాడు.

నవ్వుకొన్నది దేవకి బాధగా. తనకు తెలుసు అతడు తన ముఖంలోనికి చూస్తూ మాత్రం అబద్ధం ఆడలేడని. ఇంత వయస్సు వచ్చి, ఉద్యోగం చేస్తూ, బిడ్డలతండ్రి అయ్యి కూడా తనదంటూ ఓ స్వంత అభిప్రాయమూ, ఏ విషయం లోనూ స్వతంత్రించి ప్రవర్తింపగల ధైర్యమూ లేని ఇతడు ఇతరుల గురించి మాత్రం చక్కగా వ్యాఖ్యానించి ఉప న్యాసా లీయగలడు!

భర్తను ఆఫీసుకు పంపి తీరికగా కూర్చున్న ఆమె ఆలోచనలు పదిహేనేళ్ళ వెనక్కు పరుగు లెత్తాయి.

# 1

"ఈ స్టాండర్డు ఇలాగే నిలిపితే కాలేజీ ఫస్టేకాదు; యూనివర్శిటీ ఫస్టుకూడా రావచ్చు; పరీక్ష ఆన్సర్ పేపర్లు యిస్తూ లెక్చరర్ రమేష్ అన్న మాటలకు తలెత్తి కృతజ్ఞ తగా చూసింది లా స్టూడెంట్ దేవకి.

ఇరువురిమధ్యా జరిగిన ఈ ప్రథమ సంభాషణ కాల క్రమాన వ్యక్తిగత స్నేహంగా మారింది.

ఛలాకీగా, అన్నిటా ప్రథమురాలిగా వుండే దేవకి

అంటే రమేష్‌కు అభిమానం. శిష్టమైన ప్రవర్తనా, విశిష్టమైన రూపురేఖలూ గల రమేష్‌పై దేవకికి గౌరవం. రమేష్ కంటే అధికంగా దేవకే అతడిపై శ్రద్ధ చూపసాగింది. అతడితో మాట్లాడే అవకాశం కోసం ఎదురుతెన్నులు చూడటం అతడెప్పుడైనా కన్పించనినాడు బాధపడటం, అతడు ఏకారణంగానైనా అభినందించిననాడు అమితంగా ఏదో పెన్నిధి లభించినట్లుగా సంతోషించటం జరిగేది. ఈ పలురకాల సంతోషాలకూ మనస్తాపాలకూ మారు పేరేమిటో ఆమెకు తెలుసు. ఆమె మనసుఏమిటో, అభిమతం ఏమిటో రమేష్‌కూ తెలుసు.

"మేష్టారూ! ఈ సంవత్సరంతో నా చదువైపోతుంది కదా! తర్వాత ఏం చెయ్యమంటారు?" అడిగింది ఒకనాడు దేవకి.

"బాగుంది. నేనెవర్ని సలహా చెప్పటానికి? మీ పెద్దలు చెప్పినట్లూ, నీ వీలైనట్లూ చేయి!"

"మీ సలహా తీసుకోవాలనుకునేంత గౌరవం మీపై వున్నది గనుకనే అడిగను కదా? పోనీ, ఇది చెప్పండి. స్త్రీలు ఉద్యోగం చేయటంలో మీ అభిప్రాయం ఏమిటి?"

క్రమంగా సంభాషణ ఎటువంటి రూపు దిద్దుకొనబోతున్నదో ఊహించాడు రమేష్.

"చూడు దేవకీ" గంభీరంగా పలికిందతడి గళం. "చూడు దేవకీ నువ్వు తెలివైన దానవు. ఇతరులకు అనవసరంగా మాట్లాడే అవకాశం ఈయకపోవడం ఆడపిల్లవైన నీకు చాలా క్షేమదాయకం. ఇంత మోటుగా మాట్లాడ

వలసి వచ్చినందుకు బాధపడుతున్నాను" అతడి వదనంలో బాధ స్పష్టంగా కన్పించింది. "ఇక నా గదికి రావడం మానే సెయ్యి దేవకీ. నన్నపార్థం చేసుకోవద్దు."

కొద్ది నిమిషాలు మౌనం, నిశ్శబ్దం ఆవరించాయి.

"అటువంటి భయం నాకు లేదు" ఖంగుమంది దేవకి గొంతు నిశ్శబ్దాన్ని పటాపంచలు చేస్తూ. "అనవసరంగా మాట్లాడే అవకాశం వద్దు. ఆహ్వానాలే పంపిద్దాం మన వివాహానికి!"

ఆ కంఠంలోని ధైర్యమూ, నిశ్చలతా గమనించిన రమేష్ కలవరపడ్డాడు.

కూర్చున్న తావునుంచి లేచి పచార్లు చేయసాగాడు. మనస్సును అదుపులో పెట్టుకోవటానికి, హఠాత్తుగా అన్నాడు: "అది అసంభవం దేవకీ? అందుకే నిన్ను హెచ్చరిస్తున్నాను. ఆ ఆలోచనను మనస్సునుంచి తుడిచివేయి!"

"మేష్టారూ!" ఆకస్మికంగా కలిగిన ఆశాభంగం అంత కంటే మాట్లాడగల శక్తిని ఈయలేదు.

"ఔను దేవకీ. నీ ఆదర్శాలు నాకు తెల్సు. అందుకే నేను తగినవాడిని కాను. ఆదర్శాల హద్దుల్లో బ్రతికే అవకాశాలు లేవు నాకు. అనేక అవసరాలున్న అతిమామూలు కుటుంబంలో వాడిని నేను. నాకూ నీకూ సరిపడదు - అనే కంటే "నీకు తగినవాడను నేనుకాదు" అంటే సరిగా సరిపోతుందేమో."

"నన్ను పరీక్షిస్తున్నారనుకుంటాను."

"లేదు దేవకీ" బాధగా కణతలు రుద్దుకుంటూ

అన్నాడు: "నీ ఆదర్శాలు నాకు తెలుసు. డబ్బుతో వివాహాన్ని ముడిపెట్టేవాడు నీ దృష్టిలో పశువు. వ్యక్తిగతంగా నా అభిప్రాయం కూడా అదే. కానీ... ఆదర్శాలూ, అభిప్రాయాలూ వేరు. బాధ్యతలు వేరు!"

"అంటే... అంటే? మీకు కట్నంకావాలా?" నీరసంగా ధ్వనించింది దేవకి గొంతు.

"ఔను" అతడి పెదవులు నవ్వుతూన్న, నేత్రాలలో బాధ దృగ్గోచరమైంది. "నాకు తల్లిదండ్రులున్నారు. నేనే పోషించాలి, పెళ్ళి కావలసిన చెల్లెళ్ళున్నారు, చదువుకుంటూన్న తమ్ముడున్నాడు. ఈ బాధ్యతలన్నీ నా భుజాలపై వున్నాయి."

కొలదిక్షణాలు నిశ్చేష్టఅయింది శ్రోత. ఆమె కనులలో భాషకందని భావాలు కదులాడ్తున్నాయి.

"చూశావా! ఈ మాటలు వినగానే నీ మనసులో నాపై అసహ్యం తలెత్తింది! ఔనా?"

అయోమయావస్థ నుంచి తేరుకున్న దేవకి మెల్లగా అన్నది!

"మీరు నిజంగా మాట్లాడుతున్నారో పరిహాసం చేస్తున్నారో తెలుసుకోలేకపోతున్నాను."

"నిజమే దేవకీ. "ఆదర్శం" అంటే అయినవాళ్ళేవరూ కూడా అర్థంచేసుకోరు. ఫలితంగా నీ జీవితం నరకమౌతుంది. అది నాకిష్టంలేదు. అయిదారు వందల జీతంలో యిన్ని బాధ్యతలా— తీర్చలేను. ఇకవున్నది ఒకేదారి నన్ను నీచుడే అనుకో— అభిమానం లేనివాడే అనుకో నిస్సహాయు

డిని!...నీ ఈ అభిమానాన్ని మాత్రం జీవితమంతా అపురూపంగా గుర్తుంచుకుంటాను."

"ఛీ, ఎంతో ప్రత్యేకమైన మనస్తత్వమనుకొని భ్రమించాను. ఇంతటి సామాన్యుడా? ఒక ఆదర్శమూ, పద్ధతిలేని జీవితమెందుకు? తాను అమ్ముడుపోయిన ధనంతో చెల్లెళ్ళకు భర్తలను కొంటాడా? తలిదండ్రులను పోషిస్తాడా? ఎంత సిగ్గులేనివాడు!"

ఎవ్వరూ దేవకి మనసును మార్చలేకపోయారు.

ముప్పైవేల రొక్కం—కట్నంతో కోమలి రమేష్ భార్య అయింది.

కోమలి ఎవరో కాదు; దేవకికి పినతండ్రి కూతురే!

ఆ వివాహానికి దేవకి వెళ్ళలేదు. కోమలీ, రమేష్‌ల అభిమాన లేమిని అసహ్యించుకొని, తన ఆత్మగౌరవాన్ని ప్రశంసించుకొన్నది. మనసులో ఒకమూల అహర్నిశలూ రాచపుండులా దొలిచివేస్తూన్న వ్యధను విస్మరించ ప్రయత్నిస్తూ.

## 2

డిపార్ట్‌మెంట్ ఛీఫ్‌గా ప్రమోట్‌అయి మరో ఊరు వెళ్ళిపోతున్నాడు రమేష్. బాధపడింది దేవకి. "ఎందుకు? అతడిక ఎక్కడికి వెళ్తే నాకేంబాధ? ఏమైతేమాత్రం నాకెందుకు?" తనకేసమాధానం తెలియని సమస్య అది!

దంపతులిరువురినీ భోజనానికి పిల్చారు వెళ్ళే ముందు రోజు దేవకి తలిదండ్రులు. అతడిప్పుడు ఇంటి అల్లుడాయె!

తప్పనిసరిగా ఏదో మాట్లాడిందే కాని మనస్ఫూర్తిగా మాట్లాడలేకపోయింది దేవకి. రమేష్ ఎంతచనువుగా పలుకరించినప్పటికీ.

కోమలి పూర్వంకంటే అందంగా, నిండుగా, హుందాగా కన్పించింది. కోమలి వదనంలో తొణికిసలాడుతున్న తృప్తీ, సంతోషమూ గమనించిన దేవకి లోలోన అసూయ జెందటమే కాక విస్మయమందింది కూడా! తనను గాక తన డబ్బును అతడు ప్రేమించి వివాహమాడాడనే సంగతి కోమలి ఎలా మరచి ప్రవర్తిస్తోంది? వేలరూపాయల నడుమ మధురిమలు కూడా మనగలవా? డబ్బుతో ముడివడే బంధంలో ఆహ్లాదత వెల్లివిరియగలదా?

"నిన్ను...... ఆ యింట్లో అంతా బాగా చూస్తారా కోమలీ?" యాధాలాపంగా కుశలప్రశ్న వేసినట్టు అడిగింది. కుతూహలం పైకి ప్రదర్శించకుండా జాగ్రత్తపడుతూ, కోమలిని తన గదిలోనికి పిలచి అవీ యివీ మాట్లాడుతూ. ప్రశ్న వింటూనే తేరిపారచూచింది కోమలి అక్క దెస. మొగ్గ తొడుగుతూనే వసివాడిపోయిన దేవకీ రమేషుల ప్రణయం ఆమెకూ తెల్సు. భావగర్భితంగా సమాధానం చెప్పింది. "ఇది ప్రశ్న ఎంత తేలికో సమాధానం అంత జటిలం."

"అంటే?" అర్థంకాక అడిగింది దేవకి.

కళాహీనంగా నవ్వింది కోమలి. "నీకే పెళ్ళి అయి వుంటే నీ ప్రశ్న ఈ రూపంలో వుండేదేకాదు."

అయోమయంగా చూచింది దేవకి.

"నేనేం చెప్పినా, నీకు అర్థంకాదులే అక్కా. ఆ విషయం వదిలేయి. పెళ్ళయిన ప్రతి అమ్మాయినీ కావల సినవాళ్ళు అడిగే ప్రశ్నే యిది అడగాలి గనుక అడుగు తారు. అంతే సమాధానం యించుమించుగా ఒకటే చాలా మంది విషయంలో" నవ్వేసింది.

మరి తర్కించలేదు దేవకి.

రమేష్‌తో ఏమైనా మాట్లాడాలనేవుందికాని, అవ కాశం కలగలేదు. రమేష్‌కూడా తనకేదో చెప్పాలని ప్రయ త్నిస్తూన్నట్టు అతడి చూపులనుండే గ్రహించింది దేవకి.

"ఎందుకొచ్చిన మాటలిక యివి?" పేలవంగా నవ్వు కొంది తనలో తాను.

వీడ్కోలీయటానికి స్టేషన్‌కు వెళ్ళిననాడు, ప్లాట్‌ఫారం మీద పావుగంట సమయం దొరికింది రమేష్‌తో ఏకాం తంగా మాట్లాడటానికి.

"తర్వాత చదువా? ఉద్యోగమా? ఏం నిర్ణయించు కున్నావ్ ?" అనడిగాడు

సూటిగా అతడి కనులలోకి చూస్తూ చెప్పింది. "ఈ ప్రశ్న నాకు నేనే మిమ్మల్నడిగాను ఒకనాడు!...అప్ప ట్నుంచీ అదలా ప్రశ్నగానే మిగిలిపోయింది" అతడి వద నంలో భావాలు చదవ ప్రయత్నించింది.

బాధపడ్డాడు కానీ, చలించలేదు అతడీధోరణికి! గంభీరంగా అన్నాడు:

"మనుష్యులకు ఆశ ఎంత సహజమో, నిరాశ అంత

నిర్దిష్టం చాలా విషయాలలో. అందుకోసం అతిగా నిరాశతో నీరసపడిపోకూడదని మాత్రమే నీకు నేను శ్రేయోభిలాషిగా చెప్తున్నాను. ఆదర్శాలు...వుండవలసిందే. కానీ వాటికోసం మనం బలికావచ్చేమో కానీ, మన చుట్టూ వున్నవారిని బలిచేయలేంకదా! జరిగిన దానికి నేనూ చాలా బాధపడ్తున్నాను. కానీ ఏమిటి చేయగలం? నువ్వు, నీ అభిమానం – నిత్యం నా మనసులో వెన్నెల నింపుతుంటాయి. ఇదే ఈ జన్మకు లభించిన పెన్నిధి అనుకొని తృప్తి పడతాను."

మౌనంగా వింటూ కనుకొలకులలో నిండిన భాష్పాలు ఒత్తుకున్నది.

"మరలా...నీ వివాహానికి తప్పకుండా వస్తాను. ఈ నాటి ఈ అశ్రువులు ఆనాడు ఆనందభాష్పాలుగా మారాలి. నేను సంతోషించాలి...నీ ఆదర్శాలకు రూపు దిద్దే ఉన్నతుడు భర్తగా రావాలని ఎప్పుడూ కోరుకుంటాను."

మౌనంగా వుండిపోయింది దేవకి.

"త్వరలో శుభలేఖ పంపాలకా—" అన్నది కోమలి చేయి ఊపుతూ కదిలే రైలునుంచి.

## 3

"పైసా, కట్నం లేకుండా వచ్చాడట రాఘవరావుగారి అల్లుడు. మంచి ఉద్యోగం...ఈ రోజుల్లో యిదెంత

విద్ధూరం!" అని చెప్పుకున్నారు అందరూ.

దేవకి మనస్సు గర్వంతో లాస్యం చేసింది. ఈ నాటి యువతులందరికంటె తాను చాలా మెట్లు ఎగువననున్నట్లూ, ప్రత్యేక పరిధిలో నిలబడినట్లూ భావించుకొన్నది. ఔను మరి. డాక్టరేట్ యువకుడు మాధవరావు. మంచి జీతం. ఉద్యోగాన్నిబట్టి గౌరవ ప్రపత్తులకూ లోపమేమీ లేదు. దేవకి విద్యా, సౌందర్యమూ, వంశమూ అన్నీ నచ్చాయి అతడికి.

మనస్ఫూర్తిగా అభినందించాడు వివాహానికి వచ్చిన రమేష్.

"ఆఖరికి పంతం నెగ్గించుకున్నావ్. కట్నం లేకుండా మొగుణ్ణి సంపాదించావ్." అన్నది కోమలి ప్రశంసా పూర్వకంగా.

సంతృప్తిగా నవ్వుతూన్న దేవకి కనులలోనికి చూస్తూ, "ఈ నేత్రాలలో నవ్వూ కాంతీ ఎప్పుడూ ఇలాగే వుండా లని కోరుకుంటున్నాను అక్కా–" అంటూన్న కోమలి కంఠంలో ఏదో అనిర్వచనీయమైన బాధ.

ఆ మాటల అర్థం అత్తింట అడుగు పెడుతూండగానే అవగతమైపోయింది దేవకికి.

"అందమైన పెళ్ళామే కానీ...అందం కొరుక్కు తినేది కాదు. ఎంత రత్నమైనా పొదగటానికి బంగారం వుండాలి కదా!" కావలసిన బంధువులలో ఒకామె అన్నది ఎగాదిగా [illegible]స్తూ.

ఏదో భయంకర జంతువును చూచినట్టుగా ఆడబిడ్డలు

దూరదూరంగా నిలబడి చూడసాగారు.

క్రొత్త పరిసరాలు, క్రొత్త వ్యక్తులూ, సరిక్రొత్త జీవితపు ప్రారంభదశా! అదివరకెన్నడూ అనుభవంకాని కొంగ్రొత్త భయమేదో ఆవరించింది దేవకి మనసును. "ఇంత చదువుకున్న నేనుకూడా మామూలు స్త్రీలలాగా భయ పడ్తున్నానా?" అని తనకు తానే ధైర్యం చెప్పుకోసాగింది. కానీ ధైర్యమనే వస్తువు అందుబాటులో లేకుండా అప్పటికే ఆమడదూరం పారిపోయింది.

"ఇంత చదువుకున్నావ్; అంత అందగత్తెవు, ఇంత కళ్ళూ అంత జడా — అని పొగడకురానాయనా. కొర్రెక్కు తుంది. పెళ్ళాన్ని అణచే వుంచాలెప్పుడూ" అన్నం పెడుతూ మాధవరావు తల్లి చెల్లెలు నవ్వుతూ అనేసింది.

విద్యావంతుడూ, ఆదర్శవాదీ అయిన భర్త యింట ఇటువంటి వాతావరణం ఊహించని దేవకికి చరళపానం కావించుతూన్నట్లే అనుభూతి కలిగింది. మరీ యింత మోటు మాటలా? అనే ఆమెకు సిగ్గులేకున్నా వినే అతనికి లేదా? అదేదో సామాన్య విషయం లాగా మాధవరావు నవ్వే స్తూంటే దేవకికి మరింత కంపరం కలిగింది.

అత్తగారు సూటిగా ఏమీ అనదు. వంకర టింకరగా పిల్లిమీదా ఎలకమీదా పెట్టి, విసుర్తుంటుంది. నిజంగా సూటిగా తిట్టేవాళ్ళకంటే యిటువంటి వాళ్ళు మరీ దుర్భర పరిస్థితిని కల్గిస్తుంటారు.

"నీవు ఉద్యోగం చెయ్యడం ఎవ్వరికీ యిష్టంలేదు దేవకీ. అయినా నువ్వెందుకులే ఉద్యోగం చేయడం. ఏం

తక్కువనీ?" చల్లగానే అన్నాడు మాధవరావు ఒకనాడు. కాని అదే స్థిరనిర్ణయం కూడా! ఇక ఆనాటినుంచి ఈనాటి వరకూ ఒక్కో ఘటనా తలచుకోవడం నిజంగా అనవసరం. మనస్తాపం లేకుండా ఏ ఒక్కరోజూ గడపలేదు. గడవబోదు కూడా!

పుట్టింటికి వెళ్ళినపుడు తలిదండ్రులైనా. మరెవరైనా అత్తింటి విషయాలూ, ఆదరణ గురించీ అడిగితే తక్కువ కోమలి మాటలు గుర్తుకు వస్తాయి. నిజమే. అది ప్రశ్న ఎంత సులభమో సమాధానం అంత కఠినం.

గతాన్ని గురించిన ఆలోచనలు కట్టిపెట్టి సర్దుకోవటంలో మునిగిపోయింది దేవకి. "ఈ పెళ్ళికి వెళ్ళితీరాలి. ఇంత చిన్నపిల్లకి పెళ్ళిచేయటంలో రమేష్ అభిప్రాయమేమిటో కనుక్కోవాలి" అనే వుత్సుకత అధికంగా వుంది.

"అమ్మా! అరుణక్కయ్య నాకంటే రెండేళ్ళే గా పెద్ద? అప్పుడే పెళ్లా? వింతగా ఆశ్చర్యంగా అడిగింది జలజ.

"ఎక్కడికో ప్రయాణం?" అయిష్టంగానే అడిగింది అత్తగారు. చెప్పింది దేవకి.

"కట్నకానుక లిచ్చేశక్తి బాగావున్నట్లుంది. తొందరగానే చేస్తున్నారు పిళ్ళకి పిళ్ళా ఇంటపెట్టుకోకుండా" ఏదో ఓ ఎత్తిపొడుపులేనిదే ఆ నోటినుంచి మాటేరాదు.

విని విని అలవాటైపోయిన దేవకి ఏమీ మాట్లాడదు. పిచ్చిదానిని చూసినట్లు చూస్తుంది అంతే. అంతకంటే మార్గాంతరంలేదు. గుట్టుగా రోజులు దొర్లిపోవాలంటే.

# 4

“ఏమిటే హడావుడి? ముక్కుపచ్చలారని దానికి పెళ్ళేమిటే కోమలీ? మతిపోయిందా?”

“అబ్బ. గుమ్మంలో అడుగు పెడుతూనే ప్రశ్నలూ, సాధింపులూ అన్నీనా? నువ్వు వచ్చావు, అదే పదివేలు అక్కయ్యా, రా రా” దేవకి రాకకు కోమలి ఎంత ఆనందంగా వున్నదో ఆమె ముఖంలోని సంతోషమే చెపుతూన్నది.

“ఉత్తరం రాస్తే స్టేషన్‌కు రానా? ఇదేం రాక దేవకీ? అన్నగారు కులాసానా?” రమేషు అభిమానంగా ఆప్యాయంగా పలుకరించాడు. కాళ్ళుకడుక్కొని గదిలోకూర్చున్న దేవకికి కాఫీ యిస్తూ “నీ ప్రశ్నలకి పెళ్ళంతా అయ్యాక గానీ తీరికగా సమాధానం చెప్పలేనక్కా. చిన్నపిల్లలకే — ఈరోజుల పద్ధతికి విరుద్ధంగా చేస్తున్నాను” అన్నది కోమలి.

దేవకి మౌనంగా చూడసాగింది కోమలిని. పెళ్ళి పెద్దరికంతో హడావుడి పడిపోతూ ఏమిటోచిత్రంగా ప్రత్యేకంగా కన్పించింది కోమలి దేవకికి.

“మన స్నేహితులందర్నీ పిలిచాను. అంతా వస్తారు. నా బరువు సగం దిగినట్లుందక్కయ్యా నిన్ను చూచి, పెళ్ళి నిశ్చయమైనప్పట్నుంచీ ఎంత భయంగా గుండె దడగా వున్నదో నీకు తెలియదు. అందులోనూ ఆడపెళ్లివాళ్లం.

నిజమే కోమలి మాటలు.

ఒక్కొక్కరే దిగుతున్నారు బంధువులు. ఇక మూడు రోజులే వున్నది పెళ్ళి. కోమలి అత్త మామలు కూడా వచ్చారు సాయంత్రానికి.

కోమలితోపాటు దేవకీ ఎదురు వెళ్ళింది ఆగంతకులకు.

"పెద్దదాని పెళ్ళి సంబరంలో చిన్నపిల్లల్ని సరిగా చూస్తున్నావా లేదా?" వస్తూనే కోమలి అత్తగారు వేసిన కుశలప్రశ్న అది కోడల్ని.

నవ్వి ఊరుకుంది కోమలి. "రండి లోపలికి" అన్నది నమస్కారంచేస్తూ మామగారికి.

"వాడేడీ?"

"బజారు వెళ్ళారు, వస్తుంటారు."

ముక్తసరిగా ఏదో మాట్లాడుతున్నారే కానీ వృద్ధులు సహజంగా చూపించే ఆప్యాయత వారిలో కన్పించటంలేదు. పిల్లలెవర్నీ ఆదరంగా జేరదీయలేదు

రాత్రి రమేషు వచ్చాడు బజారునుండి ఎన్నో సరుకులు బండితో. శారీరకంగా, మానసికంగా చాలా అలసిపోతున్న ట్లుగా వున్నది అతడి వాలకం.

"వచ్చారా అమ్మా!" ప్రాణం లేచేవచ్చినంత సంతోషంతో పలుకరించాడు.

ముసలాయన మాట్లాడ లేదు. "ఊఁ, వచ్చాం" మూలిగింది తల్లి.

"వాళ్ళేమిటంత అయిష్టంగా ఉన్నారు?" అనడిగింది దేవకి చాటుగా కోమలిని.

నవ్వేసి ఊరుకున్నది కోమలి. "నువ్వే చూస్తావుగా? ఇంకా ఏమైందీ?" అన్నది తఱచితఱచి అడిగితే.

ఏమిటో కోమలి ఒకవిధమైన నిర్లిప్తతకు లోబడి పోయిందనిపించింది దేవకికి.

రాత్రి భోజనాలవద్ద ఒక చిన్న తగవు జరిగింది.

"శ్యామలా, బావయ్యా వాళ్ళూ ఎప్పుడొస్తారమ్మా? నీకేమైనా చెప్పారా? అనడిగాడు రమేషు తల్లిని. శ్యామల అతడి చెల్లెలు.

ఆవిడకు మనసులో అక్కసంతా వెళ్ళగక్కే అవకాశం లభించింది.

"ఎందుకూ? వాళ్ళు రాకపోతేనేం ? వాళ్లు రావాలనుకొన్నవాడవైతే ఈ పెళ్ళి యిలా ఎందుకు చేస్తావూ? ఆమాత్రం అభిమానం వున్నదా నీకు చెల్లెలిపై?" కయ్యిమంటూ దులిపేసింది.

తండ్రి అందుకున్నాడు: "అరుణను కోడలిగా చేసుకోవాలని శ్యామల ఎప్పట్నుంచో అనుకుంటున్నది. మేనరికం వుండగా పైగాచేసుకోవటం ఎంతసిగ్గు? ఏముఖంతో వస్తుంది పాపంఅదీ! మాకూ రావాలనిపించలేదు. లోకులునవ్వుతారని వచ్చాం, అంతే."

"రమేశ్ తలెత్తలేదు, పెదవి కదపలేదు.

"ఊరుకోండి. అయినా పాపం వాడేంమాట్లాడతాడు వాడికేంతెల్సు? నాకు తెల్సు నా బిడ్డ గుణాలు. రక్తసంబంధాలు వదులుకునేంత అన్యాయంగా వాడు ఆలోచించడు"

జోగమ్మ సణుగుడులో కోడలిపై నింద నిర్దుష్టంగా ధ్వనించింది.

అంతతో ఆగలేదు ఆవిడగోల. అను నిత్యం ప్రతి బంధువుదగ్గరా వాళ్ళూ వీళ్ళూ అని లేకుండా. ఈ వివాహం పట్ల తన అసమ్మతినీ, తన పెద్దరికమూ తన సలహా పాటించకుండా కొడుకూ కోడలూ చేస్తూన్న ఈ దురన్యాయమూ ఓపికగా వర్ణించడమేగాక, "అయినా వాడేంచేస్తాడులేమ్మా, పెళ్ళాం మాటే సాగుతోంది. వాడు మెత్తనివాడవడం మూలాన" అంటోంది ఆఖరున.

కోమలి ముఖాన ఎక్కడా నవ్వూ, సంతోషమూ అనేవి కన్పించటంలేదు.

అరుణను పెండ్లికుమార్తెనుచేసి ముందుగా అక్షంతలు వేయమని జోగమ్మకిచ్చింది కోమలి.

జోగమ్మ అందుకోలేదు. "ఎందుకులే నేనూ నా అక్షంతలూ, నా పెద్దరికం, నా ఆశీర్వాదం నీకక్కర్లేదుగా?" ముఖం మట మట లాడుతూండగా కసురుకొన్నట్లుగా అన్నది.

వచ్చిన పేరంటాండ్రందరూ ముఖముఖాలు చూచుకున్నారు. కోమలి దెస విడ్డూరంగా చూచారు.

మౌనంగా కుమార్తెకు అక్షంతలువేసి హారతి యిచ్చి, గబగబా బయటకు తప్పుకున్నది కోమలి.

వెనువెనుకనే వెళ్ళింది దేవకి.

వసారాలో నిలబడి కనులొత్తుకుంటూన్నది కోమలి. "ఛ ఏమిటి కోమలీ అది, యిలాంటిశుభసమయాన?" భుజం

మీద చేయివేస్తూ సస్నేహంగా అన్నది దేవికి "ముసలాళ్ళ గోల పోనిద్దూ."

అప్పటికీ కోమలి మాట్లాడ లేదు. దేవకి వైపు చూడ లేదు.

"లోనుండి జోగమ్మ కంఠం కంచుగంటలా విన్పిస్తూనే వుంది— "లక్షణంగా మేనరికం వుందమ్మా, మా శ్యామల కొడుకునీ కాదని పైగా చేస్తోంది కూతురు పెళ్ళి. అందుకే శ్యామూ రా లేదు. ఆడబిడ్డను దూరంచేసుకొనీ కూతురి పెళ్ళి చేస్తోంది. వాడూ తక్కువేంకాదు, బి. కాం. పాస య్యాడు... ఏమిటేమిటో వాగుతూనే వుందావిడ.

కోమలి దేవకితో అన్నది. "కోడలిపై తనకున్న ద్వేషమూ అయిష్టతలే కోడలికీ తనపట్ల వున్నాయేమోనని ఈవిడకొక అనుమాన జాడ్యం. అంతేకాని నామాట అర్థం చేసుకోదు. అన్నాదమ్ముల పిల్లలు అన్నదమ్ములే ఔతారు. అక్కాచెల్లెళ్ళ పిల్లలుకూడ అన్నదమ్ములూ, అక్కచెల్లెళ్ళ వరసలోనే వస్తారు — వాళ్ళకు పెళ్ళిళ్ళు చేయకూడదు. మరి అన్నాచెల్లెళ్ల పిల్లలైతే మాత్రం ఇదే వరస ఔతుంది కానీ వాళ్లకి పెళ్లి ఎందుకు చెయ్యాలి? ఈ తప్పుడు పద్ధతి ఎప్పుడో యెలాగో ప్రారంభమై వుంటుంది. ఈ శతాబ్దంలో యింత చదువుకున్న మనంకూడ ఇదే పద్ధతిని ప్రోత్సహిస్తే యింకేముంది? డాక్టర్లుకూడ ఇది ఆరోగ్యకరం కాదనీ, వాళ్ళ సంతానం బాగుండకపోవచ్చుననీ చెప్తున్నారీరోజుల్లో ముసల్మానులలో పినతండ్రి కూతుర్ని పినతండ్రిడినీ పెళ్ళాడే అలవాటుండేదట. మనల్ని చూసి వాళ్ళలో చాలా మంది ఇప్పుడా పద్ధతి మానేశారట. ఇలాగ మంచి నేర్చుకోవాలి

కానీ వ్యక్తిగత అధికారాలకూ ద్వేషాలకూ జీవితాలకూ ముడిపెడితే ఎలాగ?"

"నిజమే. ఇది ఆరోగ్యకరం కాదని నేనూ విన్నాను."

"కేవలం వినడమేకాదక్కా. చూడు మా అక్కని మా అత్తకొడుక్కేగా చేశారు — పిల్లల్లేరు. మా పిన్నిది కూడ మేనరికమే— పిల్లలు పుట్టగానే చచ్చిపోయేవాళ్లుట. చావగా చావగా పన్నిండోవాడో పదోవాడో బ్రతికాడట. వాడు కుంటివాడు. మరోపిల్ల వెర్రది. వాళ్ళ విషయంలో డాక్టర్లు రక్తం దగ్గరవ్వడంవల్ల వచ్చే అనర్థం ఇదని చెప్పారట. ఇవన్నీ ఆలోచించాము మేము పోనీ అరుణకు వాళ్ళ బావపై మక్కువా అంటే అదీలేదు. ఈ ముసలావిడ లాగే మా ఆడబిడ్డ ఎప్పుడూ ధుమ ధుమ లాడుతూ వుంటుంది. అంచేత అరుణకు అసహ్యం ఆవిడంటే."

"పోనీలే. మన గోలలిలా వుండేవేలే ఈ భారతీయ కుటుంబాలలో. పద, అవతల పేరంటాళ్ళకు అన్నీ చూడ వద్దా? ఇటు వంటవాళ్లకు అన్నీ అందియ్యాలి పద పద!" బలవంతంగా తీసుకెళ్ళింది దేవకి కోమలిని.

రాత్రి దొడ్లో పందిట్లో కూర్చుని నలుగురాడవాళ్లు అతిథులకు పంచిపెట్టవలసిన పాకెట్లు తయారుచేస్తున్నారు. ఓ ప్రక్క కొందరు కూరగాయలు తరుగుతున్నారు. పెళ్ళి మూడురోజులూ చేయవలసిన వంటలగుంచి రమేషు కోమలీ వంటవాళ్లతో చర్చిస్తున్నారు. ఎదురుగావున్న వరండాలో బియ్యమూ, పప్పులూ బాగుచేస్తున్నారు నలుగురు కూలి మనుషులు. వరండా చివరన అరుణ తన స్నేహితులతో

కేరమ్స్ ఆడుకొంటూన్నది. అక్కడే వాళ్లనుచూస్తూ దేవకి పూలమాల కడుతూన్నది.

పూర్తిగా యింటికి పెళ్ళికళ వచ్చింది" అన్నదిదేవకి ఉస్సురనుకుంటూ వచ్చి కూర్చున్న జోగమ్మతో. ఏదోఒకటి మాట్లాడాలి గనుక మాట్లాడింది కానీ దేవకికి ఆవిడపట్ల సద్భావంలేదు.

జోగమ్మ నిర్లక్ష్యమైన చూపు విసరి ఊరుకున్నది మాట్లాడకుండా. కేరంబోర్డు దగ్గర ఒకటే అల్లరిగా సందడిగా వున్నది.

అరుణ అల్లరీ నవ్వులూ చూచిన దేవకి "ఇంకా చిన్నతనం వదల్లేదు. పాపం అప్పుడే పెళ్ళి బాధ్యతానూ" అనుకున్నది సానుభూతిగా.

"ఏమిటే అరుణా ఆ అల్లరి? రేపు అత్తింట్లో కూడా ఇలాగే చేస్తావా ఏం? పెళ్ళికూతురివి — సిగ్గూ ఎగ్గూ లేదూ?"

కోలాహలంగా వున్న పందిరంతా ఒక్కసారి నిశ్శబ్దంగా అయిపోయింది జోగమ్మ ఉరిమిన ఈ ఉరుముకు.

"పెళ్ళి పెళ్ళన్న సంబడమేకాని క్రొత్త దానికి బుద్ధీ, అణకువా నేర్పుకోవద్దూ? పెళ్లికూతురు అట్లాగేనావుండేది?" అన్నది కోమలివైపు ఓ చూపుపారేస్తూ.

ఎవ్వరూ మాట్లాడలేదు.

"అల్లరేముందీ? సర్దాగా ఆడుకుంటున్నాం" అన్నది అరుణ.

"ఇంతకీ మొగుణ్ణి నువ్వు చూచావటే? నచ్చాడా? అన్నది" జోగమ్మ.

అరుణ మాట్లాడలేదు.

"ఏం మీ బావకంటే బాగుంటాడా?" జోగమ్మ మళ్లీ అడిగింది.

ఇక కోమలి మౌనం వహించలేకపోయింది. "అరుణా నీ స్నేహితులను నీ గదిలోకి తీసుకెళ్ళి కూర్చో" అంటూ అత్తగారిదెస తిరిగి, "దాని నెత్తిమీద ఓ అక్షతగింజవేసి ఆశీర్వదించడానికీ, ప్రేమగా ఓ పదిరూపాయలు చేతిలో పెట్టటానికీ లేని పెద్దరికం కేకలేసి చిన్నబుచ్చడానికి అప సవ్యపు ప్రశ్నలడగటానికీ మాత్రం దిగివచ్చింది కాబోలు" అన్నది. యిన్నాళ్ళుగా అణచిపెట్టిన అసహనం ఈ విధంగా బయటపడింది.

"చూశావట్రా బాబూ, నేనేమన్నాననీ? నా మనవ రాలితో నేను మాట్లాడుకోవటం కూడా తప్పే?" జోగమ్మ పితూరీ కొడుకుతో.

"మాట్లాడేతీరు అదికాదు" కోమలి సమాధానంగా అన్నది.

చుట్టుపట్ల అంతా దద్దరిల్లేంత అంకెవేశాడు రమేషు భార్యను. "నోర్మూయ్. యింక మాట్లాడకు. వెధవ గొడవ పదిమంది ఎదుటాపడి."

అప్పటికే అందరూ వింతగా వినోదంగా చూస్తు న్నారు ఈ గృహకలహాన్ని.

"అంతే అంతే. నామీదికే మీ ప్రతాపం" కళ్ళ నీళ్లతో కోమలి లోపలికి వెళ్ళిపోయింది.

ఎలా ఓదార్చాలా సర్ది చెప్పాలో తెలియని దేవకి మౌనంగా వెళ్ళి కూర్చుంది కోమలివద్ద.

"ఛీ ఛీ, నాదీ ఓ బ్రతుకేనా అన్పిస్తుంది ఒక్కోసారి. ఈ రెండ్రోజుల్నుంచీ అందరి ఎదుటా అవాకులూ, చవాకులూ ప్రేల్తూన్నా అమ్మను పన్నెత్తి ఒక్కమాట అనలేరు. అందరిఎదుటా నాపై ఎలా అరుస్తున్నారో చూడు!" అన్నది కోమలి.

"పోనిద్దూ కోమలీ. ఎలాగో రెండ్రోజులు ఓపికపట్టు. పోతారెక్కడివాళ్ళక్కడికి. అక్కడే నా బ్రతుకూ యింతే ననుకో. ఏదో పాపంచేశాం మనం. ఈ రీతిగా అనుభవిస్తున్నాం" అన్నది దేవకి. "అయినా, అత్తననే అధికారమేనా లేక ఈ ద్వేషానికి ప్రత్యేకకారణం వున్నదా?" అడిగింది దేవకి.

"ఏడవాలంటే అనేక కారణాలుంటాయనుకో" విసుగ్గా అన్నది కోమలి. వాళ్ళు ఎవతో అప్పలమ్మను 'అ, ఆలు' కూడా రానిదాన్ని అరవై వేలకు కుదిరిస్తే కాదని ఈయన నన్ను ముప్పైవేలకే చేసుకున్నారట పెళ్ళి. నా పెళ్ళినాటి నుంచీ ఈనాడు నా కూతురి పెళ్ళివరకూ గోల అలాగే వుండిపోయింది. అదీకాక. కట్నం తెచ్చావనీ కోడలు ఎక్కడ ఎగిరెగిరిపడ్తుందోననే భయంతో ముందే కాపలా కాస్తుంటుం

దన్న మాట అణచివుంచటానికి— ఏదో ఓ లేనిపోని కలహం సృష్టించి."

ఆశ్చర్యపోయింది దేవకి! "అక్కడ మా అత్తగారేమో కట్నంలేదని ఏడుస్తుంది ఏవో సూటిపోటిమాటలతో. ఇక్కడ ఈవిడకుఇచ్చినాతక్కువైందా! ఎంతందంగావుంది?"

"ఏడవనీయి, ముసల్దేకాదు ఎవళ్లెలా ఏడ్చినా నాకు లెఖ్ఖవుండదక్కయ్యా, ఆయనసరిగావుంటే చాలనుకుంటాను. కాని అదికూడా నాకు దుర్లభమైపోయి యింత బాధపడ్తుంటాను. వచ్చినదగ్గర్నుంచీ తల్లిఅలా చిత్తమొచ్చినట్టు వాగుతూంటే ఒక్కసారైనా ఆయన నోరుమూయించారా? తనే కలుగజేసుకుంటే ఆవిడ అలా మాట్లాడ్తుందా అసలు? నేను కల్పించుకోవలసిన అవసరముంటుందా? తల్లిని గౌరవించొద్దని ఎవరూ అనరు. కాని నలభై యేళ్ళు పైబడి కూడా స్కూలు కుర్రాడిలాగా అన్నిటికీ తలొంచుకొని తన వ్యక్తిత్వాన్నే మరచిపోయి ఎంతో అణుకువగా అందరికీ ఆదర్శప్రాయంగా వున్నానని మురుస్తారేమో కాని, ఆ వాజమ్మతనాన్ని కట్టుకున్న ఆడది హర్షించక పోగా అసహ్యించుకుంటుందని తెల్సుకోలేకపోతున్నారు. ఛీ ఇంతకంటేఎవళ్ళూలేని అనాధశరణాలయంలో వాడిని చేసుకుంటే సుఖపడొచ్చేమో!"

ఎంత విసిగిపోతే కోమలివంటి విద్యావంతురాలి నోటి నుండి ఇలాంటి ఘోరమైన మాటలు వస్తాయి!

వివాహం అయ్యింది అతి దుర్లభంమీద. నలభై వేలనుకున్న కట్నం అదీ యిదీ — లాంఛనాలూ అంటూ మరో ఐదువేలకు ప్రాకింది. ఒక ఏడెనిమిదివేల సామాను కూడా యిస్తున్నారు. అవన్నీ పెళ్ళికూతురికి. “మీ అమ్మాయి యింటికి కావలసినవి యిచ్చుకున్నారు. ఈనాడు స్టీలు సామాను, రేడియో, మంచాలూ, కుర్చీలు ప్రతి వాళ్ళూ యిస్తున్నారు, ప్రత్యేకతేమున్నది? ఉద్యోగస్థుడైన అల్లుడికి ఓ స్కూటర్ మీరేయిస్తారు కాని అడగటం ఎందు కనుకున్నాం, ఇవ్వవలసిందే ఈ క్షణంలో.” అని పట్టుబట్టారు పెళ్ళివారు.

కోమలకీ రమేష్‌కూ కన్నీళ్ళపర్యంతమైంది. అప్పటి కప్పుడు కోమలి మెళ్లో గొలుసు తాకట్టు పెట్టి ఆరు వేలు తెప్పించి స్కూటర్ కొనుక్కో-మని వాళ్లకిస్తేకానీ మంగళ సూత్రధారణ జరగలేదు.

‘హమ్మయ్య’ తృప్తిగా నిట్టూర్చింది కోమలి.

‘బాగా కుదిరింది తిక్క. ముక్కుపిండి వసూలు చేసు కెళ్లారు. ఇదే శ్యామల అయితే యింత గొడవ జరిగేదా?’ ఇది జోగమ్మ అమూల్యమైన అభిప్రాయం. అంతటి క్లిష్ట సమయంలోనూ కూడ ఆమెకు కొడుకూ కోడండ్రపై సాను భూతి లేదు. ‘కూతురి పెళ్ళిచేసుకుని ఇదేనా నాకిచ్చే బహు మతి? ఇంతకంటే మంచిచీర, పెద్ద పట్టుచీర రావాలి నాకు. పెళ్లికి రాకపోయినా శ్యామలకూ, దాని పిల్లలకూ మంచి బట్టలు యివ్వాల్సిందే’ అంటూ పెళ్ళివారికంటే ఘోరంగా వసూలుచేసి పట్టుకెళ్ళింది.

# 5

అరుణ ముఖంలో నూతనమైన కళా అందాలతో పాటు సంతృప్తికూడా కనపట్టింది అందరికీ.

భర్తతో అన్యోన్యంగా ఆనందంగా కలిసిపోయినట్టు ఆమె భర్తతో నవ్వుతూ తుళ్లుతూ హాయిగా మాట్లాడుతూ సినిమాలకూ షికార్లకూ తిరగడమే చెపుతోంది.

కోమలి మనసులో సంతృప్తి నిండుకున్నది.

అరుణ భర్తతో అతడి ఉద్యోగపు ఊరికి వెళుతున్న రోజు అది.

అందరూ భావించినట్లుగా - అందరి తల్లుల మాదిరిగా కోమలి కుమార్తెను కావిలించుకొని భోరుమని ఏడ్వలేదు సరి కదా కంటతడి కూడా పెట్టలేదు. ఏడుస్తూన్న అరుణను ఎంతో ధైర్యంగా ఓదార్చింది. 'ఎందుకమ్మా ఏడుపు? నీ యింటికి నీవు వెళ్తున్నావ్! హాయిగా దిద్దుకో ఇంటిని. జీవితం స్వర్గం చేసుకో ఏం కావాల్సినా నాకు రాయి. పండక్కి ఉత్తరం రాయిస్తాను ఇద్దరూ రండి.'

అంతవరకూ కళకళలాడిన యిల్లు ఒక్కసారిగా వెల వెలబోయినట్టన్పించింది.

సాయంత్రానికి కాస్త విశ్రాంతి దొరికింది. పనులన్నీ అయ్యి స్నేహితులందరితో తీరుబడిగా కూర్చుంది కోమలి.

'ఇక మాకూ్కడా సెలవిప్పిస్తావా ? రేపు వెళ్తాను నేను" అన్నది దేవకి.

"వెళ్ళొచ్చులెద్దూ. ఈ హడావుడిలో మనం అసలు మాట్లాడుకోనేలేదు. రెండ్రోజులుండండి అందరూను."

"నేనుండలేను బాబూ యిక. వెళ్ళిపోతాను. హోటల్ భోజనంతో అవస్థపడ్తూ ఇప్పటికే కంఠంవరకూ కోపం పూరించుకొని వుంటారాయన" అన్నది జలజ. ఆమె భర్త మహా కోపిష్ఠి అని అందరకూ తెల్సు.

"ఇంకా అలాగేవుందా ఆకోపం? ఈసరికి నీఎమ్మే తెలివితో, అందంతో పూర్తిగా మార్చేసివుంటావనుకున్నాను సుమా" అన్నది దేవకి.

"అంటే నువ్వు బాగా మార్చి అరచేతిలో బంధించావన్నమాట మాధవరావుగార్ని" అంటూ మిగిలిన స్నేహితులంతా వేళాకోళాలు పట్టించారు.

నవ్వలేక నవ్వింది దేవకి.

"మన ఎమ్మేలూ, మన అందాలూ దూరంగా వున్నంతసేపే భర్తలను ఆకర్షించేది. స్వంతం చేసుకున్నాక పురుషులకు ఈ చదువులమీదా సౌందర్యాలమీదా మోజు లేకపోగా వీటన్నింటివల్లా ఎక్కడ విర్రవీగుతారో- అణచి వుంచాలనే పట్టుదలా భయమూ ఎకుకువై లేనిపోని కలహాలు సృష్టించటానికి కారణమౌతాయి. అంతే" ఆవేశంగా అన్నది పావని అనే మరో స్నేహితురాలు.

ఆమె ఈ మధ్యనే భర్తనుంచి విడాకులు పొందింది.

"నిజమే పావనీ" అందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు.

పావని అన్నది "మీరంతా ఏమైనా అనుకోండి. ఒక్కమాట స్పష్టంగా చెప్తాను. మీలో ఎవ్వరైనా సరే- ఏ ఒక్కళ్ళయినా సరే. నేను నిజంగా ఆనందంగా వున్నాను నాకే బాధాలేదు" అని చెప్పండి- చెవి కోయించుకుంటాను."

స్నేహితులంతా ముఖముఖాలు చూచుకున్నారు ఈ సవాలు విని.

"ఎందుకలా నిర్ఘాంతపోతారు? మనమంతా చెప్పుకో దగ్గ స్నేహితులం. మనస్సులు విప్పి మాట్లాడుకున్నంత మాత్రాన మనలో మనకి చిన్నతనమూ అవమానాలూ వుండవు. నా మాట నిజమానా కాదా చెప్పండి? పెళ్ళికి వచ్చినవారిలో చాలామంది నన్ను చూసి గుస గుసలు పోయారు. కాని ఎంత కష్టపడితే మరొక దారి లేకపోతే స్త్రీ నా భర్తా, నా సంసారం నా యిల్లూ- అనే బంధాలను తెగ తెంపులు చేసుకుంటుందీ అనే సానుభూతిలో ఎవరూ ఆలోచించరు."

"నిజమే పావనీ" కోమలి అన్నది. సాటి స్త్రీలనుండే యీ విషయంలో నిజంగా సానుభూతి వుండదు. రకరకాలుగా వ్యాఖ్యానిస్తారు.

దేవకి అన్నది: "సానుభూతివరకూ ఎందుకాలోచిస్తు న్నారు మీరు? నిజంగా మనకు సగానికి పైగా శత్రువులే సాటి ఆడవాళ్ళు. బాధించే అత్తగారెవరు— సాటి స్త్రీ; సూటిపోటి మాటలని నెగడు ఎగదోసే ఆడబిడ్డలెవరు- సాటి స్త్రీలు. పురుషుని వెర్రెత్తించి భార్యనుంచి వేరుచేస్తూన్న విలాసిని ఎవతె- సాటి స్త్రీ! కేన్సర్ వంటి మందులేని భయం కర వ్యాధి ఇది! ఎంతో ఆదర్శవంతంగా బ్రతుకుదాం- ఎలాగెలాగో వుందాం- మనం చదుపుకున్న స్త్రీలం, సామా న్యులవలె అసూయా ద్వేషాలూ, సాంసారిక కలహాలూలేని స్వర్గధామం సృష్టించి చూపుదాం- అనుకుంటామే కాని ఆ ఆదర్శాలన్నీ నీరుగారిపోయి ఆఖరికి మనమూ జీవన పోరా టంలో సామాన్య వనితలమైపోయాం."

"దీనికి పరిష్కారం ఏమిటి?" పావని ప్రశ్న. "ఆలో చిస్తే, కృషిచేస్తే ఏదో మార్గం వుండకపోతుందా?" అని ఎన్నోసార్లు ఆలోచించాను నేను. ఎంత అణగి మణగివున్నా ఎంత సర్దుకుపోయినా రెండ్రోజుల్లో మళ్ళీ ఏదో ఒక సమస్య. కలహం, వాగ్వివాదాలు, ఉపవాసాలు, నిరసనలు, ఛీఛీ, విసిగిపోయాను ఈ వైవాహిక జీవితంలో."

"నువ్వేకాదు పావనీ" జలజ అన్నది. "అందరూ విసిగిపోతూనే వుంటారు. ఎంతో అన్యోన్యంగా కాపురం చేస్తూన్నట్లు కన్పించే వాళ్ళయినా ఎప్పుడో ఒకప్పుడు విసిగి పోయి "ఛీ ఏం సంసారం?" అని విరక్తిపడే సమయాలూ, చావును కావాలని కోరుకునే సంఘటనలూ వుండకపోవనీ నా అభిప్రాయం, నమ్మకం కూడా" అంటూ అంద

ముఖాలూ చూచింది.

అందరూ మౌనంగా ఊరుకున్నారు. పావనీ జలజల మాటలను అందరూ అంగీకరించారన్నమాట!

కోమలి ప్రారంభించింది; "ఇప్పుడు నామాటవినండీ. మీరంతా నన్ను పధ్నాలుగేళ్ళ అరుణకి పెళ్ళేమిటని అడిగిన వాళ్ళే. ఇప్పుడు చెప్పబోతున్నాను. ... మనలో అనగా మనతరం వాళ్ళం ఎవ్వరమూ మిత్రులు- బంధువులు పరిచితులు- తెలిసినంతమట్టుకు ప్రతి స్త్రీ ఏదో పెద్ద అసంతృప్తితోనే బాధపడుతోంది. భర్త ఎంత సద్వర్తనుడూ, సహృదయుడూ అయినా, అత్తగారు ఎంత అమృత హృదయిని అయినా ఎదుటవారిని బాధించి నరకాన్ని సృష్టించే గయ్యాళిల మాట నేను చెప్పటంలేదు. సగటు స్త్రీల విషయమే నేను చర్చించేది.

"మన అమ్మలూ, అమ్మమ్మలూ, అత్తయ్యలూ ఏమీ చదువుకోనివాళ్ళు. పదేళ్ళకే పెళ్లయి పదమూడేళ్లకే కాపురానికిపోయి ఇరవైయేళ్ళకే నలుగురైదుగురుపిల్లలకు తల్లులై ముప్ఫయి యేళ్ళకే ముదిమిని సంతరించుకొనేవారు. లోకం ఏమిటో, భర్త ఏమిటో, జీవితం ఏమిటో తెలియకుండానే అమాయిక దశలోనే జీవితంలో ప్రవేశ పెట్టబడేవారు. గొర్రెలలాగా ఆలోచన లేకుండా బ్రతికే వారు! వారికి తెలిసినదల్లా పెద్దల సూక్తులూ, పురాణాలు. "పతియే ప్రత్యక్ష దైవం" "అత్తమామలు సూర్యచంద్రుల వలె కంటికి కన్పట్టే దైవాలు. వారి సేవచేసి వారి వంశాభివృద్ధి చేసినందువలననే నేనూ, నన్ను కన్నవారూ కూడా

తరించిపోతారు" అని నమ్మేవారు. అందుకే పతి కొట్టినా, తిట్టినా, భోగలాలసతో భార్యను విస్మరించినా నిర్లక్ష్యం చేసినా వెనుకటితరం స్త్రీ సంతోషంగానే బ్రతికింది. అత్త మామలూ ఆడపడుచులూ కసిరి కోతకు గురిచేసినా ఆనాటి కోడలు సహించి కాపురంచేసి ఉత్తమ ఇల్లాలయ్యేది.

"ఈనాటి విద్యావతికి పతి ప్రత్యక్ష దైవం కాదు. ప్రాణస్నేహితుడు. పతి సేవలతోనూ, అతడి పరివారపు ఆజ్ఞాపాలనతోనే పవిత్రురాలనై పోయాననీ, వారి వంశాభి వృద్ధిని చేయటంలోనే తరించిపోయాననీ సంతోషించి తల మునకలుకాదు. సంసారనౌకకు చుక్కానియై రాత్రింబవళ్లు శ్రమించుతూన్న తనకుగుర్తింపూ, రాణింపూ, గౌరవమూ వుండాలని కోరుకుంటూన్నది ఈనాటి యువతి. ఈ అల్పమైన కోరికలే అధిక సంఖ్యాకులకు దుర్లభమౌతున్నాయి. ఫలి తంగా ఘర్షణాసంఘర్షణలుఏర్పడి, పరిణామాలు ఘోరంగా వుంటున్నాయి. సూక్ష్మంగా చెప్పాలంటే తన తెలివీ, విజ్ఞా నమూ వ్యక్తిత్వమే ఈనాటి యువతికి శత్రువులై ఆమెలో సంఘర్షణను లేవదీసి ఆమెజీవితాన్ని అసంతృప్తికి ఆలవాలం కావించుతున్నాయి.

"అందుకే వ్యక్తిత్వమూ, ఆత్మగౌరవమూ అంటే ఏమిటో తెలియని అమాయకదశలోనే అరుణకు వివాహం చేశాను. విద్యావంతులనీ, బాలవివాహాలనుండి తప్పించు కొని ఏదో అభివృద్ధి సాధించిన ఆధునికులమనీ విర్రవీగే నవ నవనాగరికు లెవరూకూడ అవేమీ తెలియని అజ్ఞానులనుభ వించే సుఖంలో వెయ్యోవంతుకూడా అనుభవించడంలేదు.

ఆత్మతృప్తీ, మనశ్శాంతీ అనేవి ముందే మృగ్యం.

"ప్రకృతి సిద్ధంగా స్త్రీ కొన్ని కొన్ని బాధలకూ, బాధ్యతలకూ బందీ, స్త్రీని హింసించే ఈ ప్రకృతి మారదు. స్త్రీని విమర్శించే ఈ సంఘం మారదు. స్త్రీని బంధించే సంఘ సూత్రాలు మారవు. స్త్రీని నిరంతరం ఆత్మక్షోభకు గురిచేసే ఈ సమాజం మారదు. విద్యా విజ్ఞానాలతో మారిపోయిన స్త్రీ ఈ మారని సమాజ వ్యవస్థలో చిత్రవధ ననుభవించుతూన్నది. అందుకే స్త్రీ కూడా మారకపోవడమే నేటి స్త్రీ సమస్యకు ఏకైక పరిష్కారం!"

"స్త్రీ స్వాతంత్ర్యం, స్త్రీ విద్య ప్రాముఖ్యం స్త్రీ బానిసకాదు" అంటూ "వేదిక లదరగొట్టి ఉపన్యాసాలిచ్చిన కోమలివేనా నువ్వు అని అనుమానంగా వుంది నాకు" అన్నది దేవకి కాలేజీ రోజులను తలచుకుంటూ.

"ఆదర్శాలు వేరు, అనుభవాలువేరు" అన్నది కోమలి మామూలుగా.

"నా భర్త కట్నానికి బానిస అని నేను ఒకనాడు బాధపడినట్లు ఈనాడు అరుణ బాధపడలేదు చూశావా? పైగా ఎంత సంతోషంగావుందది? కారణం? మనసు వికసించలేదు. మేధ పెరగలేదు. వ్యక్తిత్వం ఏర్పడలేదు. అంతే, సంసారజీవితంలో అవి ఇక అసలు ఎదగవు. అందుకే దాని జీవితం సుఖంగా సంతోషంగా సాగిపోతుంది."

దేవకిని సాగనంపటానికి స్టేషన్‌కు వెళ్ళాడు రమేష్.

ఇంకా రైలు రావటానికి వ్యవధి వున్నది.

రమేష్ మనసులో గతస్మృతులు మెదిలాయి. పెళ్ళయి కూతురూ, అల్లుడూ వున్న నాకు ఇంకా ఆ మధురస్మృతి అయిన ప్రణయం నిన్నమొన్నటిదిగా మనసున మెదులు తోంది" అనుకొని తనలో తాను నవ్వుకున్నాడు.

సరిగా దేవకి మనసుకూడ అదే ఊహ మెదిలిందేమో చిన్నగా నవ్వుకొన్నది.

"అప్పుడేమనం ఎంత పెద్దవాళ్లమైపోయాం?" అన్నది దేవకి.

"ఔనుమరి" అన్నాడతడు సన్నగా నవ్వి.

చాలా ఆలోచించిన మీదట దేవకి అన్నది: "చూడండి, చనువుగా ఓ విషయం చెప్తున్నాను. ఏమీ అనుకోవద్దు. కోమలి పాపం మానసికంగా చాలా బాధ పడ్తోంది మీ ప్రవర్తనవల్ల. మరీ అంత బాధాకరంగా మీరు ప్రవర్తించకూడదు" అన్నది చొరవగా.

రమేష్ ముఖం గంభీరంగా మారిపోయింది. కొన్ని నిముషాల మౌనానంతరం అన్నాడు! "ఔను, నాకూ తెల్సు. నిన్న మీ మాటలన్నీ నేను విన్నాను లోపల్నుంచి. నేను నిద్రపోలేదు" అన్నాడు.

గతుక్కుమన్నది దేవకి. గుండె దడదడమన్నది.

"నేను చాలా సామాన్యుణ్ని దేవకీ. భార్య విష యంలో ఆదర్శపురుషుడిలా ప్రవర్తించలేని అసహాయుణ్ని."

నిర్ఘాంతపోయి చూచింది దేవకి.

"ఔను దేవకీ! చూడు! నిన్ను వదలుకొని కోమలిని వివాహమాడిన నాడే నేనెంత అసమర్థుడినో నీకు తెలిసి వుంటుంది......"

"లేదు లేదు" ఖంగారుగా అడ్డుతగిలింది దేవకి.

"నన్ను చెప్పనియ్ దేవకీ. నిన్నూ, కట్నం తీసుకొన కూడదనే ఆదర్శాన్ని వదలుకొని మరో గొప్ప ఆదర్శాన్ని నిలపానను కున్నాను. తలిదండ్రుల పోషణా, చెల్లెలివివాహం, తమ్ముడి చదువూ అనే మహత్తర బాధ్యతలకోసం ఒక ఆదర్శాన్ని త్యాగంచేశాను. కానీ ఏంలాభం? తమ కొరకు ఈ విధంగా ప్రవర్తించానని తలిదండ్రులకు ప్రేమ గౌరవాలు లేవు. పైగా గ్రద్దల్లా పొడుచుకుతింటున్నారు. ఇంత మనస్తాపానికి గురై తన పెళ్ళి చేశాననేవిశ్వాసం చెల్లెలికేమాత్రం లేదు. ఉన్నదైతే ఇలా ఇంట్లో పెళ్ళి ఔతుంటే రాకుండా అవమానించేదేనా శ్యామల నన్ను? ఎంతో వెచ్చించి చదివించిన తమ్ముడికసలే అభిమానం లేదు నాపై. ఇన్నిటిలో మనిషి దేవుడిలా ప్రవర్తించలేదు. ఆదర్శాలు అపహసించక పోవటం వేరు. ఆదర్శాలు అపహసించడం వేరు. ఎవరి కొరకైతే ఇన్నిన్ని త్యాగాలు చేశానో వారంతా నన్ను రాబందుల్లా పీడిస్తుంటే నిస్సహాయమైన నా క్రోధం నిష్కారణంగా భార్యపైకి తిరుగుతోంది. ఆమెవల్ల తప్పులేదని తెల్సినా సరే, ఆదర్శాలు అపహసించినవేళ ఎంతటి ఉన్నతుడైనా అతి సామాన్యుడై పోతాడు! నిస్సహాయుడై పోతాడు ప్రత్యేకతను కోల్పోయి."

రైలు బయలుదేరడానికి సిద్ధంగా వున్నది. రమేష్ దేవకి దెస చూస్తూ అన్నాడు: "నా విషయంలో ఈ నాటికీ నీ మనస్సులో ఏదో మూల అసంతృప్తిగానే వున్నట్లు నేను గ్రహించాను. ఔనా?"

అపరాధినిలాగా తల వాల్చుకున్నది దేవకి. మాట్లాడలేదు.

"సిగ్గుపడొద్దు దేవకీ, ఆ దశను దాటిపోయిన ప్రౌఢ వయస్కులం మనమిప్పుడు... నిజంగా నేనుమాత్రం ఆ విషయంలో చాలా సంతోషిస్తున్నాను."

దెబ్బతిన్నట్లు చూచింది దేవకి.

"ఔను స్పష్టంగా మాట్లాడుతూన్నందుకు బాధ పడవద్దు. నీ సంసారంలో కలతలూ మనస్పర్థలూ లేకుండా వున్నావా నువ్వు?"

ఒక్క నిట్టూర్పు మాత్రమే సమాధానమైంది దేవకినుండి.

గంభీరంగా అర్థయుక్తంగా నవ్వాడు రమేష్. "నువ్వూ నేనేకాదు ప్రతివాళ్ళూ అంతే. వివాహాత్పూర్వం ఊహించే స్వర్గధామం వేరు, వివాహానంతరం అనుభవాలు చెప్పే అర్థాలు వేరు. అక్కడ వ్యక్తిత్వాలు నిలవవు. ఆదర్శాలకు ఆస్కారం వుండదు. సంసార తాపత్రయంలో ఎటువంటివారైనా సామాన్యులే అయిపోతారు. అందుకే మన మధ్య దూరం యిలా వున్నది గనుకనే మన మధ్యనున్న సుకుమారమైన ఆ అభిమానం అలాగే సుందరంగా వున్నది.

ఏళ్ళు గడుస్తూన్నప్పటికీ. వివాహ బంధమే వుంటే ఆ అభిమానమూ సున్నితమూ యేనాడో వసివాడిపోయివుండేవి!"

ట్రెయిన్ పరుగులు పెడుతూంటే దేవకికి పదే పదే రమేష్ కోమలీల మాటలు గుర్తుకు రాసాగాయి.

"ఔను, కోమలి సరిగానే ఆలోచించింది. కాంతి కిరణాల వక్రీభవనం, ధ్వనితరంగాలు, యాసిడి రాడికల్స్, ఆటోస్ఫెరిక్ ప్రెషర్, సెంటర్ ఆఫ్ గ్రావిటీ... చరిత్రలు యుద్ధాలు, యుద్ధాలు జరిగిన తారీఖులు, ఆర్థిక సూత్రాలూ జామెట్రీ, కావ్యాలు... ఎన్నో ఎన్నో చదువుతాం. పట్టభద్రులమౌతాం. కాని ఉద్యోగస్థురాలికి మినహా సంసార జీవితంలో అందరూ సామాన్యులే! ఈ ప్రయాణానికి ముందు తానూ భర్తా పడిన ఘర్షణ హఠాత్తుగా మెదిలింది ఆమె మనసులో.

"నాకో రెండు వందలు కావాలి" అన్నది దేవకి భర్తతో.

వింటూనే ముఖం చిట్లించాడు మాధవరావు. "రెండెందుకూ?" అన్నాడు.

"ప్రయాణానికి ఓ వంద చేతిలో వుండటం మంచిది కదా. పెండ్లికుమార్తె చేతిలో ఓవందైనా పెట్టకపోతే ఏం బాగుంటుంది?"

"పోనీ పెళ్ళికి వెళ్ళటం మానేయరాదూ? ఎందుకీ అనవసరపు ఖర్చు?"

ప్ర క్ష ప్ర ఖ్యం  వ మే అ ల త్రి  త ఒ ఆ ణ